క్లుప్తంగా

వ్యాధుల నియంత్రణకు ప్రజలు సహకరించాలి


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మోహన్

మెట్‌పల్లి: పట్టణంలో వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, దీనికి ప్రజలు కూడా సహకరించాలని కమిషనర్ మోహన్ కోరారు. స్థానిక 5 వార్డు ఆరపేటలో శుక్రవారం డ్రై డే సందర్భంగా చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు.డ్రెయినేజీ కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లాలని సిబ్బందికి సూచించారు.ఇళ్లల్లోని కూలర్స్, కుండీ ల్లో రోజుల తరబడి నీటిని నిల్వ ఉంచకుండా తొలగించాలన్నారు. అపరిశుభ్రత వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


బావిలో బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న సిబ్బంది

మల్యాల: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో స్వాతి అన్నారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో కొద్దిరోజుల నుండి తాగునీటి బావుల్లో శుక్రవారం బ్లీచింగ్ పౌడర్ వేశారు. గ్రామాల్లో మురికినీటి కాలువలు శుభ్రం చేయడం, చెత్త తొలగించడం, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండ చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో స్వాతి అన్నారు. పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామాల్లో డ్రై డే


నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం డ్రై డేగా పాటించారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ పర్యటించారు. ఇళ్లలో నిల్వ నీటిని పారబోశారు. మురికికాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో ఇళ్ల ఆవరణలో నీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగించొద్దని విద్యార్థుల ప్రచారం


అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

రాయికల్: ప్లాస్టిక్ వస్తువులను వినియోగించొద్దని కోరుతూ రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాయికల్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో వర్తక వ్యాపారస్తులను కలిసి ప్లాస్టిక్ వినియోగించవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కైరం సత్యంగౌడ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు దంత వైద్య పరీక్షలు


విద్యార్థుల దంతాలు పరీక్షిస్తున్న వైద్యుడు

జగిత్యాల: దంతాలను రోజుకు రెండుసార్లు శుభ్రం చేసుకోవాలని దంత వైద్యుడు డాక్టర్ శైలేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓల్డ్ హైస్కూల్‌లోని భవిత పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకుని పళ్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సల్లంగా చూడు గంగమ్మతల్లి

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, గంగపుత్రుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, వారికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం పాలకవర్గం, కౌన్సిలర్ సిరికొండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి దక్కేదెవరికో?

పెగడపల్లి: పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకం కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎన్నికలు ఆలస్యం కానున్న నేపథ్యంలో మండల కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ పదవులపై కన్నేశారు. ఏఎంసీ చైర్మన్ పదవికి ఐదేళ్ల పాటు రిజర్వేషన్ చేశారు. మొదటిసారి జనరల్, రెండోసారి ఎస్టీ జనరల్, మూడో సారి జనరల్ మహిళకు కేటాయించారు. నాలుగో దఫా బీసీ జనరల్‌కు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయం విధితమే. పదేళ్లుగా ఎలాంటి అవకాశాలు దక్కని కొందరు మండల కాంగ్రెస్ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులపై ఆశలు పెంచుకున్నారు. నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీల నియామకం కోసంపై ఎమ్మెల్యే దృష్టి సారించడంతో పదవి కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు విప్‌ను కలిసే పనిలో పడ్డారు. పదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకులకే ప్రాధాన్యత ఉంటుందని ఈ దిశగా ఎమ్మెల్యే పేర్కొనడంతో నాయకులు ఎవరి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. పెగడపల్లికి చెందిన ఒరుగల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, వెంగళాయిపేట ఎంపీటీసీ భర్త కడారి తిరుపతి, లింగాపూర్ ఎంపీటీసీ శోభ భర్త పూసల తిరుపతి, సుద్దపల్లి ఎంపీటీసీ విజయలక్ష్మి భర్త సింగసాని స్వామి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆకుల విష్ణు, వీరితో పాటు మరికొంత మంది నాయకులు మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవితో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులకు పోటీ పడుతున్నారు. చైర్మన్ గిరి మండల కాంగ్రెస్ నాయకుల్లో తీవ్ర పోటీ ఉండగా పదవి ఎవరని వరిస్తుందోనని, అధినేత ఆశీస్సులు ఎవరికి ఉంటాయో ఎదురుచూడాలి.

ఎస్పీని కలిసిన వాకర్స్ వెల్ఫేర్ సభ్యులు



జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోగల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను శుక్రవారం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్, సభ్యులు లక్ష్మీనారాయణగౌడ్, రవీందర్, మాధవరెడ్డి, రాజన్న, రాములు, సతీశ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలతో పేదలకు నాణ్యమైన వైద్యం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్


పల్లె దవాఖానాకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: పల్లె దవాఖానాలతో గ్రామాల్లోని పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం, కొల్వాయి గ్రామాల్లో రూ. 40 లక్షల నిధులతో పల్లె దవాఖానాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు ద్వారా విద్యతో పాటు, రోగులకు సూపర్ స్పెషాలిటి సేవలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి రెండు రోజులు క్రితం ఇంజనీరింగ్ ఇన్ ఛీఫ్ (ఈఎన్‌సి)ని కలిసినట్లు పేర్కొన్నారు. అనంతరం బీర్‌పూర్ రైతువేదికలో 20 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో లచ్చాలు, ఆర్‌ఐ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు నారపాక రమేశ్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా

రాయికల్: విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మురళీ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు పిప్పోజి మహేందర్ బాబు, నాయకులు పాలిక రవీందర్, పడకంటి స్వామి, సుదర్శన్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

జగిత్యాల: జిల్లా కేంద్రానికి 7వ తరగతి విద్యార్థి బందెల తక్ష విహార్ అమెరికా ఎన్ఎస్ఎస్ నాసా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చాడు. కాస్మోస్ పారిడార్ అనే ప్రాజెక్ట్‌లో అమెరికాలో జరిగిన సమావేశానికి హాజరై జాతీయస్థాయిలో రెండోస్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సచిన్, సరిత, డీన్ శ్రీనివాస్, సందీప్ పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో ఆలయాల అభివృద్ధికి కృషి


ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

మల్లాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) సహకారంతో నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రేగుంట శ్రీ మల్లన్న స్వామి ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధులు రూ.10 లక్షలు మంజూరవగా, శుక్రవారం రేగుంట గ్రామస్తులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. మండలంలోని 16 ఆలయాలను టీటీడీ బోర్డు నిధులు రూ.10 లక్షల చొప్పున మంజూరయ్యాయని, వాటితో ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుందెల్ల నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాలసాని రాజన్న, యాదవ సంఘం సభ్యులు మల్లేశ్, గంగరాం పాల్గొన్నారు.

ఆలయ నిధులపై రాజకీయం తగదు

మెట్‌పల్లి: టీటీడీ బోర్డు మంజూరు చేసిన నిధులపై కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు టీటీడీ బోర్డు సభ్యుడిగా జిల్లాకు 85...కోరుట్ల నియోజకవర్గంలోని 57 ఆలయాలకు రూ.10 లక్షల చొప్పున నిధులను మంజూరు చేయించారన్నారు. ప్రస్తుతం ఆ పనులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ వస్తే వాటిని కృష్ణారావు పంపిణీ చేస్తూ .. నిధులను తాను మంజూరు చేయించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కృష్ణారావు చిల్లర రాజకీయాలతోనే నర్సింగరావు వరుసగా ఎన్నికల్లో ఓటమి చెందుతున్నారని, ఇప్పటికైనా తన సోదరున్ని అదుపులో పెట్టుకోవాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు కేటాయించిందని, వాటికి ప్రస్తుత ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూరు గ్రామ శివారులోని కస్తూర్బాగాంధీ స్కూల్‌ను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మాజీ సర్పంచ్ వంతడుపుల అంజయ్య, ఉపాధ్యాయులు విశ్వ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో చోరీకి విఫలయత్నం

మల్యాల: మండలంలోని రామన్నపేటలో దొంగలు ఓ ఇంట్లో చొరబడి బీరువా పగులగొట్టి, చోరీకి యత్నించారు. రామన్నపేట గ్రామానికి చెందిన ఉమ్మడి రవి తమ ఇంటికి తాళం వేసి, రెండు నెలలుగా మరోచోట నివాసముంటున్నారు. ఈ క్రమంలో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాను పగులగొట్టి, వస్తువులు చిందర వందర చేశారు. రవి పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటనా స్థలానికి ఎస్సై నరేశ్ వెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి, చోరీకి విఫలయత్నం చేశారని, ఈ సంఘటనలో ఎటువంటి వస్తువులు ఎత్తుకెళ్లలేదని బాధిత కుటుంబసభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ పట్టివేత

కోరుట్లరూరల్: మండలంలోని నాగులపేట శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లు, 1టిప్పర్‌ను వీఆర్‌వో సురేందర్ నాయక్ గురువారం రాత్రి పట్టుకున్నారు. నాగులపేట శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సురేందర్ నాయక్ సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను, టిప్పర్‌ను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న ట్రాక్టర్లు, టిప్పర్ రికార్డులు పరిశీలించి జరిమానా విధిస్తామని తహసీల్దార్ కిషన్ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం మేరకు శుక్రవారం దాడులు చేయగా ఎనిమిది పేకాట ఆడుతున్నట్లు గుర్తించి, ఐదుగురు పట్టుబడ్డారని, మిగతా ముగ్గురు పారిపోయారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.14,200 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి


మల్లాపూర్ పీఎస్‌లో ఏఎస్పీ భీమ్‌రావు

మల్లాపూర్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఏఎస్పీ భీమ్‌రావు అన్నారు. శుక్రవారం మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. సేష్టన్‌లోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌స్టేషన్ పరిధిలో గస్తీ, పెట్రోలింగ్, విజుబుల్ పోలీసింగ్‌ను పెంచాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలీసులు అంకితభావం, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

రోడ్లపై గుంతలతో ప్రజలకు ఇబ్బందులు


వినతిపత్రం ఇస్తున్న హిందూవాహిని సభ్యులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్‌లో నాలుగు వైపులా పాత సీసీరోడ్లున్నాయని, పూర్తిగా గుంతలమయమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి హిందు వాహిని ప్రాంత సంపర్క నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టవర్ సర్కిల్ ప్రాంతంలో రద్దీ ఉంటుందని, చిన్నపిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయంలో వర్షం నీరు గుంతల్లో నిలిచి ఉండటంతో తెలియక అందులో పడిపోతున్నారని, వచ్చే వినాయక చవితి, దుర్గనవరాత్రుల సందర్భంగా ఊరేగింపులు ఇలానే వెళ్తారని, వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖలు వేముల సంతోష్, కైలాసపతి, విష్ణు, హరీశ్, మహేశ్, రాకేశ్, ప్రతాప్, దశరథం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మల్లాపూర్: కుస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాజు, షాహెబాజ్ హుస్సెన్, శృతి, సునీతను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మురళి, మాజీ సర్పంచ్ సరికెల లక్ష్మి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సరికెల మహిపాల్, హెచ్‌ఎంలు సత్తయ్య, వీవో గోపు మమత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని మైతాపూర్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కూరగాయల సురేశ్, ఆకుల రమేశ్, రవినాయక్, సుగుణ కళ, విజయ, అంకారావును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోపి మాదవి, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు శ్యామల, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడింగ్ శిక్షణతరగతులు ప్రారంభం

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌లో కోడింగ్ శిక్షణా తరగతులను హైదరాబాద్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో అరుణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులకు తమ కంపెనీ ద్వారా ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు కూడా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ తుమ్మనపెల్లి సత్యనారాయణ, కరస్పాండెంట్ మనోజ్ కుమార్, ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయాలి

జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో అనేక హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయడం లేదని,ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా రైతు భరోసా ఇవ్వలేదన్నారు. నాయకులు జలపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, గంగారెడ్డి, రంగు గోపాల్, పన్నాల తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, పులి శ్రీధర్, సోమేశ్వర్, రమేశ్, సతీశ్, పోచయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు

కోరుట్ల: పట్టణంలోని రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెటర్నిటీ బెనిఫిట్స్,మహిళా సాధికారత, భేటి పడావో, బేటి బచావో, గర్భిణులకు పౌష్టికాహారం, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల చదువు, బాల్య వివాహాల నిషేదం, మహిళా రక్షణ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సాయిశ్వరీ, హిమ, స్వప్న, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

'జర్నలిస్టులపై దాడి సరికాదు'


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మల్లాపూర్: జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సరికాదని మండల జర్నలిస్టులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ వీర్‌సింగ్‌కి మండల జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యని కవరేజ్ చేస్తున్న జీ తెలుగు న్యూస్ జర్నలిస్టుపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టు శ్రీచరణ్‌పై దాడి చేసిన పోలీసులను శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల జర్నలిస్టులు రుద్ర రాంప్రసాద్, కనుక సంజీవ్, ముత్యాల రమేశ్, మిడిదొడ్డి మల్లేశ్, గుగ్గిల్ల రాజశేఖర్, పెంబి మహేశ్, మోర సతీశ్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం రాంచందర్, రాజేందర్, మధు, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


చల్‌గల్‌లో మొక్కలు నాటుతున్న సీఐ సర్వేశ్వర్

జగిత్యాలరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో 75వ వన మహోత్సవంలో భాగంగా గీత కార్మికులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అక్కాని, కానిస్టేబుళ్లు, గౌడ సంఘం అధ్యక్షుడు మారుతి గౌడ్ పాల్గొన్నారు.

పచ్చదనం, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం

జగిత్యాల: పచ్చదనం, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మినీస్టేడియంలో మొక్కలు నాటి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో పచ్చదనం, అభివృద్ధికి వనమహోత్సవం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టచైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా వివిధ రకాల 60 పండ్ల మొక్కలను విద్యార్థులు, అధ్యాపకులు నాటారు. ప్రిన్సిపాల్ సంజీవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కట్లకుంట నక్కలగుట్ట ప్రాంతంలో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేస్వర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. భీమారంలో హైస్కూల్ ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్-1 పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అశోక్ తెలిపారు. టౌన్-1 పరిధిలోని రాంబజార్, పురాణిపేట, ఎల్జీరామ్‌లాడ్జ్, అంగడిబజార్, యావర్‌రోడ్, మార్కెట్ బ్యాక్‌సైడ్ ఏరియా, కృష్ణానగర్, అరవింద్‌నగర్, మార్కండేయ టెంపుల్ ఏరియా, బైపాస్‌రోడ్, శ్రీరాంనగర్, వెంకట్రాదినగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొలాస సబ్‌స్టేషన్ పరిధిలో..

పొలాస సబ్‌స్టేషన్ పరిధిలోని పొలాస, గుల్లపేట,అగ్రికల్చర్ కళాశాల, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, అనంతారం రోడ్డాం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఏఈ సుందర్ తెలిపారు.

మెట్‌పల్లి: పట్టణంలోని టౌన్-2 సెక్షన్ పరిధిలోని కళానగర్, రాంనగర్, ఆదర్శనగర్, సుల్తాన్‌పురా, దీన్‌దయాళ్‌నగర్, కొత్త బస్టాండ్, రేగుంట, వెంకట్రావ్‌పేట, టీచర్స్ కాలనీ, బాలకృష్ణనగర్, దుబ్బవాడ, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.

రాయికల్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని రాయికల్ పట్టణం, మైతాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్ తెలిపారు.

మల్యాల: మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిలిపివేయనున్నట్లు ఏడీఈ సీహెచ్.బాలలింగం తెలిపారు. మద్దుట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు రాయికల్‌లో జగన్నాథ రథయాత్ర

రాయికల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర పట్టణంలో శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని గాంధీచౌక్, బస్టాండ్, పటేల్‌విగ్రహం, శివాజీవిగ్రహం, గుడికోట వరకు రథయాత్ర జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆషాఢ మాస బోనాలు


కోరుట్ల త్రిశక్తి ఆలయంలో బోనాలు

కోరుట్లటౌన్: పట్టణంలోని త్రిశక్తి మాత ఆలయంలో ఆషాఢమాస బోనాలు వైభవంగా శుక్రవారం నిర్వహించారు. గణేష్ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండలి ప్రతినిధులు కట్ట నారాయణ, గణేష్, శంకర్, ప్రభాకర్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

చింతకుంటలో పోచమ్మ బోనాలు


కథలాపూర్ మండలం చింతకుంటలో బోనాలతో వస్తున్న మహిళలు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనాలతో గ్రామం నుంచి పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి, దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వనభోజనాలు చేశారు.